# పంట

కాంతయ్యకు కాళ్లూ చేతులు ఆడడంలేదు. అనుకోని ఉపద్రవం ముంచు కొచ్చింది. చేతికందింది కాస్తా నోటికి అందకుండాపోయే విషమపరిస్థితి. రెండెకరాల పంట నీటిపాలైతే బతుకులు ఏటిపాలు కావాల్సిందే. నిన్నటిదాకా పెళ్లున కాస్తున్న ఎండ చిటపట లాడించేస్తూ చిరుచెమటలు పట్టించింది.



అదేం కర్మమో! తెల్లారేసరికి ఆకాశమంతా మబ్బుతెరలతో మసకబారింది. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందన్న వార్తతో రైతుల గుండెల్లో గుబులు మొదలైంది. ఊళ్లో అంతదాకా కళకళలాడుతున్న రైతుల ముఖాల్లో నీలినీడలు కమ్ముకొచ్చాయి.

మరుసటిరోజు సాయంత్రానికి అల్పపీడనమల్లా వాయుగుండంగా మారడంతో రైతుల నోట్లో ముద్ద దిగడంలేదు.

ఊళ్లో గత పదిరోజులుగా వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ముందెత్తున కోతలు కోసిన రైతులు కుప్పలు వేయడం కూడా మొదలైంది. కూలీల కొరత బాగా కనబడుతోంది. మెట్ట ప్రాంతాల నుంచి పొట్టతిప్పలకోసం వచ్చిన వలసకూలీలతో మోతుబరి రైతుల పశువుల కొట్టాలు నిండిపొయ్యాయి. మోతుబరుల అక్కరలు తీరాకనే వలస కూలీలు సన్నకారు రైతుల పొలాల్లో పనులకు దిగాలి.

అప్పటికే కుప్పలు వేసుకోగలిగిన రైతులు తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నారు. కోతలు కోసి ఓదెలు ఆరబెట్టుకున్న సన్నకారు రైతుల చావుకొచ్చి పడింది. హైబ్రీడ్ విత్తనాలొచ్చాక, వారందినాలు కర్ర పచ్చి మీదనే వుండి, ఓదెలు సరిగా ఆరడం లేదు. వరిపనలు వర్షపు నీటిపాలయితే ఆరుగాలం పడిన కష్టం వ్యర్థం. గింజరాలి మొక్క మొలిచిపోతుంది. రైతు నిలువునా మునిగిపోయినట్లే. వానపడకముందే కుప్పలు పడాలి.

ఓదెలు ఆరినవాళ్లు కుప్పలేసుకుంటే నష్టం వుండదు. కాని ఓదెలు ఆరీ ఆరకుండా కుప్పలు వేసుకుంటే ధ్యానం ముక్కిపోతుంది. గింజ నడుంవిరిగి తక్కువధర పలుకుతుంది. అయితే పూర్తి నష్టంకన్నా, గుడ్డిలో మెల్లన్నట్లు కొద్ది నష్టంతో బైటపడొచ్చు. మూకుమ్మడిగా రైతులంతా కూలీలకోసం ఊరుమీద పడ్డారు. తెల్లారేసరికల్లా కూలీల్ని కూడగట్టగలగాలి.

ఇంట్లో కాంతయ్య దిక్కు తోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. బయటి వాతావరణానికి తోడు ఇంటి పరిస్థితీ బాగోలేదు. తులసమ్మ రెండ్రోజులనుండి అనారోగ్యంతో బాధపడుతోంది. ఆమెకు ఉబ్బసం.

ఊళ్లో ఆర్.ఎం.పి.డాక్టర్ రామయ్య చేతనైనంత వరకు వైద్యం చేస్తూనే వున్నాడు. అదేంటోగానీ, రోగం పూట పూటకూ పెచ్చరిల్లసాగింది.

'ఏంది రామయ్యా! సూదులు ఏసినోడివి ఏసినట్టే వుండావు. జబ్బు నిదానించకపోయె" అపనమ్మకంగా అడిగాడు కాంతయ్య.

"అదే నాకూ అర్థంగావటంలా! సూదేసినాక గంటలో ఉబ్బసం నెమ్మదించేది. ఈ సారికి వొండికి తిరిగినట్టుంది. బయటి వాతావరణమూ బాగోలేదు మరి. నిమోనియా కింద తిరుగుతుందేమో! ఎందుకైనా మంచిది గుంటూరు తీసుకెళ్లి చూపించుకురా" తేల్చి చెప్పాడు వెళ్తూ రామయ్య.

ఆ మాటలకు కాంతయ్య కంగారుపడ్డాడు. తులసమ్మను పట్నంలో ఆసుపత్రికి తీసుకుపోవాలంటే చేతిలో డబ్బుండొద్దూ! ఎక్కడెక్కడ తెచ్చిందీ పెట్టుబళ్లకే సాలటంలేదు.

వారం క్రితమే, కోతలకు, కుప్పేతకు చేతిలో చిల్లిగవ్వలేని స్థితిలో వడ్లవ్యాపారి సూరయ్యను ఆశ్రయించాడు.

"సూరయ్యా! మాసూళ్లయ్యాక ధాన్యం ఎత్తుకుంటావుగా! కూలీలకివ్వటానికి చేతిలో రూపాయన్నా లేదు. ముందొక ఐదువేలుంటే సర్దు" అంటూ పీకలమీద కూచున్నాడు కాంతయ్య.

"ఏడున్నాయి మావా! మిల్లు షావుకారు ఇక నావల్ల కాదంటూ చేతులెత్తేశాడు. రెంద్రూపాయలొడ్డీకి నిన్ననే లక్ష రూపాయలు దెచ్చా. నీ బోటోళ్లకు సర్దటానికి గంట పట్టలే!" అంటూ నీలిగాడు సూరయ్య.

"అలాగంటే ఎలా! మా ఇబ్బందులన్నీ తెల్సినోడివి. నువ్వు కాదంటే ఎవర్నడగాలి? పదటో, ఇటో వతనుగా ఇన్నేళ్ళు ధ్యానం నీకే ఎత్తుతున్నా గదా! ఏనాడన్నా పక్కచూపు చూశానా చెప్పు" అంటూ మొండికేశాడు.

"చెప్పాగదా! ఉంటే నీకు లేదనే మనిషినా? ఈ సారికి యాడ్నో తిప్పలు పడు". సూరయ్య అంత తేలిగ్గా చోటుబెట్టే రకంగాదు.

"ఏ దారీ లేకనే నిన్నెదుక్కుంటా వచ్చింది. ఎనకటి రోజుల్లో అంటే కూలి కోసరం నాల్రోజులు ఆగమంటే ఆగేవాళ్లు. ఇప్పుడట్టా గాదు. గట్టెక్కుతూనే చేతిలో పెట్టాలి. ఒకటికి రెండుసార్లు తిప్పించుకున్నామా, మళ్లీ పనంటే పత్తా వుండరు". ఇబ్బందుల్ని ఏకరువు పెట్టాడు కాంతయ్య.

విసుగుబుట్టి కాంతయ్య పోకపోతాడా అన్నట్లు సూరయ్య కాసేపు తాత్సారం చేశాడు. వ్యాపారంలో వున్న సాధక బాధకాలు, మిల్లర్లు పెడుతున్న ఇబ్బందులు, అధికార్లు దండుకునే లంచాల గురించి చెప్పుకొచ్చాడు. ఇంత దండగమారి వ్యాపారం మరొకటి లేదంటూ అదే పనిగా వాపోయాడు.

సూరయ్యనోటంట ఈ రకం మాటలు వినడం కాంతయ్యకు కొత్తేంగాదు. నేతి బీరకాయలో నెయ్యెంత వుంటుందో, సూరయ్య మాటల్లో నిజమంతే వుంటుందని ఊరంతటికీ తెలుసు.

భూమిని నమ్మి పంటలు పండించే రైతుల పరిస్థితి ఏడాదికేడాది దిగనాసిల్లిపోతుంటే, పంటలతో వ్యాపారం చేస్తున్న దళారులు మాత్రం తెగబలిసిపోవడం జగమెరిగిన సత్యం. అప్పుల్లో మునిగి రైతులు దరిద్రులవుతుంటే, వ్యాపారులు లాభాలతో కుబేరులవుతున్నారు.

ఆస్తి పంపకాల్లో ఎకరం పొలం వాటాగా పంచుకున్న సూరయ్య నేడు పదెకరాల ఆసామి. పట్నంలో తక్కువ ధరలకు కొన్న స్థలాల విలువ లక్షలకు పెరిగింది. మంచి

ఇల్లు కట్టగలిగాడు. పిల్లలిద్దర్నీ పట్నం కాలేజీల్లో లక్షలు బోసి చదివిస్తున్నాడు. ఐతే పైకిమాత్రం బీదరుపులు అరుస్తుంటాడు. ఊళ్లోవాళ్లు అంతా తెలిసున్నా, ఏం తెలియనట్లే నటిస్తుంటారు. ఇదో దొంగాటకం.

"మీవాడు పట్నంలో ఏదో ఉద్యోగం చేస్తా వున్నాడుగందే! నువ్వడిగితే పెట్టుబళ్లకు సాయం చెయ్యకపోనా?" అంటూ దారి మళ్లించాడు.

"ఏం మాలావు ఉజ్జోగంలే సూరయ్యా! వాడి పెళ్లాం, బిడ్డల్ని సాకటానికే చాలకపోతుండే. ఇక నాకేం పంపుతాడు. వాడి మామ తిండిగింజలు చేరెయ్యబట్టి కూర-నార వండుకు తిన గలుగుతున్నారు. కొడుకు నాకియ్యకపోతే మానె, నన్నడకుంటే చాలనుకుంటన్నా". కొడుకు సంసారం గురించి చెప్పాడు.

ఎంతో కొంత ముట్టజెప్తేగాని కాంతయ్య గడప దిగేట్లులేదని గ్రహించాడు సూరయ్య. మూడువేలు చేతికిచ్చి సర్దుకోమన్నాడు. కోతలకు, కుప్పలకు ఎటూ చాలవంటూ భీష్మించుకుంటే మరో వెయ్యితెచ్చి కాంతయ్య చేతబెట్టాడు.

"ఏందయ్యా! వాయుగుండమంటున్నారు. ఏడాదిపడిన కష్టమంతా ఏటిపాలవుద్దేమో! కూలీల్ని జూసి కుప్ప వేయించకపోయా!" అంత బాధలోనూ తులసమ్మ తన ప్రాణం గురించి కన్నా పంటగురించే ఆరాటపడ్తున్నది.

"అదే ఆలోచిత్తన్నా! గుంటూరుకు తీసుకెళ్లి చూపించుకురమ్మంటన్నాడు రామయ్య. నీ బాధసూత్తంటే పోయొత్తేనే మంచిదనిపిత్తంది" అన్నాడు ఆయాసంతో ఎగిరెగిరిపడుతున్న భార్య ఎదను జూస్తూ.

"నాదేవన్నా కొత్త రోగమా! పుటకల కాణ్ణించి వుందదే! పంట మట్టి గొట్టుకుపోతే కూటికి మొగంవాయాల. అప్పుల్లో బతుకు గుండమైపోద్ది. నామాటిని ముందుగాల కుప్పేయించే పని జూడయ్యా! ఇంతలోనే నా పేణం బోదులేగాని" అంటూ రోగాన్ని తేలికజేసి మాట్లాడింది. తను పడుతున్న బాధను పైకి కనబడకుండా అణిచిపెట్టింది.

తులసమ్మను ఆ స్థితిలో వదిలిపెట్టి లేవలేకపోయాడు కాంతయ్య. ఉబ్బసంతో ఆమెకు ఏడాదిలో సగం బాగుంటే సగం బాగోదు. వానాకాలం, శీతాకాలం మందులతో నెట్టుకురావడమే. ప్రాణం బాగోలేదన్న సాకుతో పడకేసే రకంగాదు. ముక్కుతూ, మూలుగుతూనైనా సరే ఇటు ఇంటిపనులు, అటు పొలంపనులు చక్కబెట్టే మనిషి. రోగాన్ని కూడా జీవితంలో ఒక భాగంగా భరించడానికి అలవాటు పడిపోయింది.

ఇలాంటప్పుడే కాంతయ్యకు కొడుకు జ్ఞాపకం వస్తాడు. సమయానికి చేతికింద లేకపోయాడన్న చింత కలుగుతుంది. తనో, కొడుకో తులసమ్మను పట్నం తీసుకెళ్లి

ఆసుపత్రిలో చూపించే వీలుండేది. ఒంటరితనంతో ఇట్లా గుంజాటనపడే అవసరం లేకపోయేది.

రత్నం ఇంటర్మీడియట్ వరకే చదవగలిగాడు. ఊరికి కూతవేటు దూరంలో వున్న మండల కేంద్రంలో జూనియర్ కాలేజి వుండడంవల్ల ఆ మాత్రమన్నా చదివే వెసులుబాటు కలిగింది. అంతకుమించి చదవటం తలకు మించిన భారమని ఇద్దరికీ తెలిసిన సంగతే. అక్కడితో కొడుకు చదువు ఆగిపోయింది. ఇంటి పట్టునుంటూ పనుల్లో చేదోడువాదోడుగా వుండేవాడు.

ఐదేళ్లకిందట కూతురి పెళ్లిచేశాడు. పసుపు కుంకుమలకింద ఎకరం మాగాణి చదివించాడు. ఇక మిగిలింది ఎకరం పొలం. ఉంటున్న పాతకాలపు పెంకుటిల్లు. అదే తన తదనంతరం కొడుక్కి మిగిలే ఆస్తి. కూతురు పెళ్లిజేసిన మరుసటేడే కొడుక్కీ పెళ్లిజేశాడు.

కూతురు కాపురానికి వెళ్లాక తులసమ్మ పనిభారంతో సతమతమవడం కాంతయ్య గమనించాడు. కూతురి స్థానంలో కోడల్ని తీసుకొస్తే ఇల్లు చక్కబెట్టుకుంటుందన్న ఆశతో కొడుక్కి సంబంధం ఖాయం చేశాడు. ఆశించినట్లుగానే కోడలు సమర్థురాలే అనిపించింది. అణకువ కలిగి అత్తకు అన్నివిధాల సాయమందించేది.

ఇద్దరు బిడ్డల తండ్రయ్యాక రత్నం ఆలోచనాధోరణి మారసాగింది. దాని వెనుక కోడలి ప్రోద్బలం లేకుండా వుంటుందనుకోలేదు. కుటుంబ ఆదాయంలో ఎదుగూ బొదుగూ లేకపోగా అవసరాలు పెరుగుతూ రాసాగాయి. ఇంట్లో చికాకులు, సర్దుబాట్లు స్పర్థలకు దారితీస్తున్నాయి. "నాన్నా! మేం పట్నంబోయి బతుకుతాం" కొడుకు అన్న మాటలు మనసును మెలిదిప్పాయి.

"అక్కడేం వుందిరా బతకడానికి?"

"ఇక్కడ మాత్రం ఏం వుందంటావు?" ప్రశ్నకు ప్రశ్న జవాబు. "లేకేంరా! ఇల్లూ, పొలం వుందిగా?"

"ఎకరం పొలంతో రెండు కుటుంబాలు బతకడమెట్లా? ఏడాది పొడుగుతా చేస్తున్న శ్రమెంత? చివరకు మిగిలేదెంత? తిండీ బట్టకే చాలడంలేదు. గొర్రెకు బెత్తెడు తోకన్నట్లు, రేపు పిల్లల చదువులు, భవిష్యత్తు గురించిన మాటేంటి?"

కాంతయ్య ముందు ఆవేశపడ్డా, కొడుకు నిష్ఠూరం వెనకున్న కఠిననిజాలు గ్రహించే ప్రయత్నం చేశాడు. వాతావరణం అనుకూలించి సక్రమంగా రెండు పంటలు చేతికొస్తే, ఖర్చులన్నీ బోను ఏడాదికి ఎకరాకి పదిహేనువేలు మిగిలితే గొప్ప. ఆ కొద్దిపాటి ఆదాయంతో ఈ గడ్డు రోజుల్లో ఇద్దరు బతకడమే గగనం.

ప్రకృతి వైపరీత్యాలో, మనుషులకు అనారోగ్యాలో మీదొచ్చిపడితే అప్పులపాలు కావడమే. దుక్కిదున్నే రైతుకు, మగ్గంనేసే నేతగాడికి పుట్టగతులు లేకుండా పోయే పరిస్థితి దాపురించింది. ఏ రంగంలో పనిచేసే వాడికైనా భవిష్యత్తు మీద గంపెడంత ఆశ వుంటుంది. కాని రైతన్నవాడే ఏ ఆశ లేకుండా బతుకీడ్చేవాడయ్యాడు. అందుకే వ్యవసాయం దండగమారిదనుకుంటూ రైతుబిడ్డలు పల్లెబాట వదిలి పట్నంబాట పడుతున్నారు. తన కొడుకూ అందుకు మినహాయింపు కాదనుకున్నాడు కాంతయ్య.

"నాన్నా! ఒక కన్‌స్ట్రక్షన్ కంపెనీలో సూపర్‌వైజర్‌గా ఉద్యోగం చూసుకున్నా. ఉండడానికి వసతి, నెలకు ఐదువేలు జీతమిస్తానంటున్నారు. రేపు పిల్లల చదువులకది పట్నం అయితే బాగుంటుంది" వివరంగా చెప్పాడు తండ్రికి.

తను కాదని ఎలా అనగలడు. ఏడాదికి అరవై వేలు ఆదాయం. నీడపట్టున కూచుని పని చేసుకుంటే టంచనుగా చేతిలోకొచ్చి పడుతోంది. నాలుగైదెకరాలున్న రైతుకి వచ్చే రాబడికి సమానం. అదీ పరిస్థితులన్నీ సానుకూలంగా వుంటేనే మిగులు. తమ తదనంతరం కొడుక్కి దక్కేది ఎకరం. వాడి తదనంతరం పిల్లలు పంచుకోగల్గింది చెరో అరెకరం. దాంతో వాళ్ల జీవితాలు ఎలా ఎల్లమారతాయి?

"సరే! నీ ఇష్టంరా!" అంటూ కొడుకు నిర్ణయానికి తలొగ్గక తప్పలేదు కాంతయ్యకు.

"ఇంకా అట్టనే కూకుంటే ఎట్టా? ముసురనంగానే రైతులంతా ఒక్కసారే కూలీలకోసం ఎగబడతారు. ముందుచూపు లేకపోతే మునిగిపోతాం" అంటూ తులసమ్మ కాంతయ్యను బయటకు తరిమింది.

కాంతయ్య కూలీలకోసం గాలించడం మొదలెట్టాడు. తెలిసిన ముఠాల వాళ్లంతా అప్పటికే ఒప్పందాలు చేసేసుకున్నారు. ఎక్కడక్కడి రైతులంతా పొరుగూర్నించి కూడా వచ్చి కూలీల కోసం పరుగులు తీస్తున్నారు. పోటీలు పడ్తున్నారు. రైతులు రెండో మాట మాట్లాడకుండా కూలీలు అడిగినంత ఇచ్చుకోవడానికే సిద్ధపడుతున్నారు.

చీకటి పడింది. కాంతయ్య కూలీలకోసం వేట కొనసాగిస్తూనే వున్నాడు. వేళమించే కొద్దీ గుండెధైర్యం సన్నగిల్లసాగింది. సమయానికి కూలీలు దొరక్కపోతే జరిగే నష్టం గురించి ఆలోచిస్తుంటే భయం వేస్తోంది. ఒక పక్కన తీర్చాల్సిన పాతబాకీలు ఇంకా మిగిలే వున్నాయి. వాటికి కొత్త బాకీలు తోడయితే ఎప్పటికి కోలుకోవడం? అప్పుల ఊబిలో దిగబడిపోవడమే!

సరిగ్గా వారందినాల క్రితం కూతురు రాసిన ఉత్తరం మదిలో మెదిలింది. బయటి బాకీల ఒత్తిడొచ్చి కిందటి ఏడాది కౌలు డబ్బు పదివేలు కూతురి చేతికివ్వలేకపోయాడు.

ఈ ఏడు కుప్ప నూర్పిళ్లవుతూనే రెండేళ్ల కౌలుడబ్బు తెచ్చి అప్పగించకపోతే అత్తా, మొగుడూ తిట్లు, శాపనార్థాలు పెడతారంటూ కూతురు ముందస్తుగానే ఉత్తరంలో హెచ్చరించింది. తన కారణంగా కూతురి కాపురంలో కలతలు తలెత్తకూడదనుకున్నాడు. తల తాకట్టుపెట్టయినాసరే ఈసారి కూతురి కౌలు డబ్బు చెల్లువెయ్యాల్సిందే!

రైతులు గింజలు విత్తిన దగ్గర్నుంచి మళ్లీ గింజలు చేతికొచ్చేదాకా ఎన్నిగండాలు గట్టెక్కాలి! అదునుకు వానుండాలి. దుక్కులు దున్నాలి. నేల పదునవ్వాలి. మేలురకం విత్తనాలు దొరకాలి. నారు పొయ్యాలి. సాగు నీరందాలి. నాట్లు వెయ్యాలి. బలానికి ఎరువులు పెట్టాలి. పురుగులు, తెగుళ్లు సోకకుండా పురుగుమందులెయ్యాలి.

కోతలు, కట్టేతలు, కుప్పలు, నూర్పిళ్ళు ఎన్ని పనులని? అతివృష్టి లేకుండా వాతావరణం అనుకూలిస్తేనే సజావుగా పంట చేతికొచ్చేది. ఆపై గిట్టుబాటు ధరుంటేనే పెట్టుబడి పోను పదో, పరకో రైతుకి మిగిలేది.

కష్టాలకు తగిన ఫలితం దక్కుతుందన్న గ్యారెంటీ లేకుండానే రైతనేవాడు ఎన్ని చావులు చావాలో! ఈ ఏడాది పంట దిగుబడి తగ్గేలా వుంది. వాతావరణం అనుకూలించక సకాలంలో ఎరువులందక రైతాంగం అల్లాడిపోయింది. ఎరువుల పంపకంలో అవినీతి, అక్రమాలు చోటు చేసుకోవడంతో రైతులు సహనం కోల్పోయి రోడ్లెక్కారు. ప్రభుత్వ ఆఫీసుల మీద దండెత్తారు.

ఆగ్రహంతో నిరసనలు తెలిపారు. ధర్నాలు చేశారు. పోలీసుల లాఠీలు విరిగాయి. రైతుల తలలు పగిలాయి. జైళ్లపాలయ్యారు. ఎన్నడూ లేంది కాంతయ్య కూడా లాఠీదెబ్బలు తినాల్సి వచ్చింది.

"ఏంటి కాంతయ్యగారూ! ఈ వరకాడ పాలెంలోపడి తిరుగుతున్నారు. కూలీలకోస మట్టుందే..." అంటూ చింపిరయ్య పలకరింపుకు ఉలిక్కిపడ్డాడు.

"అవున్రా బాబు! వెతకబోయిన తీగ కాలికి తగిలినట్టుంది. రెండకరాలు కుప్పెయ్యాలి. నీ ముఠాని తీసుకొస్తావా?" అంటూ పనేంటో చెప్పాడు.

"పెసిరెంటుగారు కబురెట్టే బయల్దేరేనండి. కట్టేత కొసరమేననుకుంటున్నా". బెట్టుగానే వుంది వ్యవహారం.

"ఆయనకేంరా బాబు! నీలాంటోళ్లు వందమంది. సాయంత్రంబట్టి తిరగలేక చస్తున్నా. ఒక పక్కన వాయుగుండమంటున్నారు. రేపటికి కుప్పేసుకోపోతే కొంప కాల్లేరవుతుంది". బతిమిలాడుతున్న ధోరణిలో అడిగాడు.

"కూలీలకు చచ్చే గిరాగ్గుందండి! మడిసికి రెండొందలంటేగాని పలికేటట్టు లేరు. బాగా తెల్సినోళ్లు, మీ బోటోళ్లను నిలబెట్టి ఏమడగ్గలం చెప్పండి" అంటూ చింపిరయ్య లౌక్యం ప్రదర్శించాడు. గిరాకిని బట్టే వస్తువులకు విలువ మరి! ప్రకృతి వైపరీత్యం రైతులకు ప్రాణసంకటమైంది. కూలీల కొరతవల్ల రైతులు ఒక మెట్టు కిందుంటే, కూలీలు ఒక మెట్టు పైనుంటున్నారు. అసలు పల్లెల్లో పొలం పనులు చేసే కూలిజనం తగ్గిపోతున్నారు.

అంతకంతకు ఎక్కువ కూలి గిట్టుబాటయ్యే బేల్దారి పనుల్లాంటి ఎన్నో పనులు వెతుక్కుంటూ పట్నాలకు పోవడం ఎక్కువైంది. ఊళ్లో రైతులూ కర్ర పెత్తనాలకు అలవాటుపడి, పొలం పన్లకు వంగడంలేదు. పొలాలు కౌళ్లకిచ్చి పట్నంలో షికార్లు, సరదాలకు తిరగడం మామూలైంది. అవసరానికి తగ్గట్టు కూలీలకు అడిగినంత ఇవ్వాల్సిందే! ఇలాంటప్పుడు రూపాయికి జూసుకుంటే పదిరూపాయలు పోద్ది!

"నలుగురితోపాటు నారాయణ! వాళ్లడిగినంత కూలి ఇద్దాంలే! పదిమందిని పోగేసుకుని పొద్దుటే చేనుకిరా. మధ్యాన్నానికల్లా కుప్పపడాలి. వానడితే దుంప నాశినమైపోతాం" అంటూ పని ఖాయమన్నట్లు రెండొందలు చింపిరయ్య చేతిలో వుంచి, తేలికపడిన మనసుతో ఇంటి దారి పట్టాడు కాంతయ్య. నడుం వాల్చాడన్న మాటేగాని రాత్రంతా కంటిమీద సరిగా కునుకే పట్టలేదు. మాటిమాటికి లేస్తూ తులసమ్మకు ఎట్లా వుందోనని గమనించడం, బయటికెళ్లి ఆకాశం దిక్కు పరకాయించి చూసుకోవడంతోనే తెల్లారిపోయింది.

కాంతయ్య చద్దన్నం మూటగట్టుకొన్నాడు. నిచ్చెన భుజానేసుకుని, కట్టుతాళ్లు తీసుకుని, హడావుడిగా పొలం బయల్దేరాడు. "పోయొస్తానంటూ" తులసమ్మ చెవిలో చెప్పాడు. ఆరోగ్యం బాగుండుంటే తనూ బయల్దేరేదే! కుప్పేసి సాయంత్రం తిరిగొస్తూనే దబ్బు సర్దుబాటు చేసుకుని భార్యను పట్నం తీసుకెళ్లాలనుకున్నాడు. జేబులోవున్న దబ్బు కూలీలకు బొటాబొటీగా సరిపోయేలాగుందనుకున్నాడు.

పొలాలమీద ఎటు పారజూసినా రైతుకూలీల హడావుడే కనిపిస్తోంది. కుప్పలు వేసే పనిలో తలమునకలుగా వున్నారంతా. కూలీలతో పాటు చేలోకి దిగుతూనే, మాపిటేలదాకా వానపడకుండా వుండాలని దేవుడికి మొక్కుకున్నాడు కాంతయ్య.

మరొకరోజు గనుక ఓదెలు ఎండపాటునుండుంటే కుప్పేతకు బాగుండేదను కున్నాడు. ధాన్యం ముక్కోస్తుందనుకుంటే ముసురెళ్లగానే కుప్పపడగొట్టి నూర్పిడు చేయించాలనుకున్నాడు. ఎంత ప్రాప్తం వుంటే అంతే దక్కుదలనుకుంటూ గుండె దిటవుచేసుకున్నాడు.

ఆడకూలీల్ని ప్రత్యేకంగా ఒక పక్క మడిలోకి దించాడు. వాళ్లు కట్టే చిన్న చిన్న కట్టలు కుప్పనేతకు అనువుగా వుంటాయన్న ఆలోచన కాంతయ్యది. పెద్ద కట్టలు కట్టగలిగిన మగకూలీల్ని దగ్గర మళ్లలోకి సర్దాడు. మధ్యాన్నానికల్లా పనలన్నీ మోపులు కట్టడం పూర్తయింది. మూడొందల యాభై కట్టలు లెక్కకొచ్చాయి.

కాంతయ్య అంగలతో కొలిచి కుప్పెంత వెయ్యాలో హద్దులు పెట్టాడు. మధ్యమోపు నిల బెట్టించి గూడు కట్టమన్నాడు చింపిరయ్యతో. ముందుగా మగకూలీలు కట్టిన పెద్ద మోపుల్ని గుండ్రంగా పరుస్తూ గూడు కట్టించాడు. కుప్పకు అర్ధవేసి ఆనక బోటు పెట్టుండేసరికి మబ్బులు నల్లగా కమ్ముకురాసాగాయి. చల్లగాలి తిరిగింది. కాంతయ్య గుండె దడదడలాడింది. వాన వంగేలా వుందనుకున్నాడు.

"కానీండ్రా! వానొచ్చిందో, చేసిన చాకిరంతా బూడిదలో పోసిన పన్నీరవుద్ది. కాస్త ఓపిక చేసుకోండి. త్వరగా మోపులుతెచ్చి పడేస్తే కుప్పయిపోద్ది" కూలీల్ని అభ్యర్థిస్తున్నట్లుగానే తొందర పెట్టాడు కాంతయ్య.

కూలీలు కూడా ఓపిక కూడదీసుకుని పని వేగం పెంచారు. తీసుకున్న కూలికి న్యాయం చెయ్యాలన్న నిజాయితీ వాళ్లల్లో కనిపిస్తోంది. మళ్లలో బురదను కసపిస తొక్కుకుంటూ మోపులు తెచ్చి నిచ్చెనమీదుగా కుప్పకందిస్తున్నారు. చింపిరయ్య కూడా కుప్ప పైనుంచి కూలీల్ని అదిలిస్తూ బోటు పెట్టడం పూర్తిచేశాడు. ఇక మిగిలింది కుప్పనేత ఒక్కటే.

చివరిగా ఆడంగులు కట్టిన తేలికపాటి మోపులు విసురుగా తెచ్చిపడేస్తుంటే, పనలు విడదీసి కుప్పమీద సర్దుతూ నాజూగ్గా నేత నేస్తున్నాడు చింపిరయ్య. కుప్పనేత పూర్తవుతుందనగానే ఒక్కో చినుకు రాలడం మొదలైంది. కుప్పమీద కుచ్చుబెట్టి, దారి మూసుకుంటూ చింపిరయ్య కుప్పకిందకు దిగొచ్చేసరికి వాన జోరందుకుంది. బతుకు జీవుడా అనుకున్నారంతా.

ఒక్కో కూలీకి రెండొందల చొప్పున, పదిమంది కూలీలకు రెండువేలు లెక్కగట్టి, అడ్వాన్సుగా ఇచ్చిన రెండొందలు తగ్గించుకుని మిగిలిన డబ్బు చింపిరయ్య చేతబెట్టాడు. జేబులో చూసుకుంటే వందరూపాయలు కూడా నిండా మిగల్లేదు.

కాంతయ్య నిచ్చెన భుజానేసుకున్నాడు. విజయోత్సాహంతో, యుద్ధరంగం నుండి వెనుదిరిగిన వీర సైనికుడిలా, జోరున కురుస్తున్న వానలో తడిసి ముద్దవుతూ, పొలం గట్లమ్మటగా ఊరుదారి పట్టాడు. అంతదాకా కుప్పేత ధ్యాసలో పడి సర్వం మరిచిపోయాడు. పంటను రక్షించుకోవడం ఒక్కటే లక్ష్యంగా కాలం తెలియలేదు. కాంతయ్యకు ఇప్పుడు ఇల్లూ, ఇంట్లో అనారోగ్యంతో ఒంటరిగా పడున్న ఇల్లాలూ గుర్తొచ్చారు. భార్యకెట్లా

ఉందో అన్న ఆలోచన మనసులో మెదుల్తూనే కలవరపాటుకు గురయ్యాడు. పంట నష్టాన్ని కాచుకోగలిగినందుకు తులసమ్మంతగా సంతోషపడే వాళ్లు ఇంట్లో మరెవరున్నారు?

కాంతయ్య ఊళ్లోకి వచ్చేసరికి బాగా చీకటిపడింది. కరెంటు పోయిందేమో! ఇళ్లల్లో గుడ్డిదీపాలు మినుకు మినుకుమని వెలుగుతూ, వుండుండి విసురుగా వీస్తున్న గాలికి రెవరెపలాడుతున్నాయి. వానకు మట్టిరోడ్ల మీద నీరుపారుతూ బురదతో కసకసలాడుతున్నాయి. వర్షం దెబ్బకు జనంకూడా పెద్దగా కదలాడడం లేదు.

కాంతయ్య నిలువెల్లా తడిసి ముద్దయ్యాడు. ఇంట్లోకి అడుగుపెట్టేసరికి చీకటి కమ్ముకునే వుంది. ఇంకా దీపం వెలగనే లేదు. గుండె వేగంగా కొట్టుకోసాగింది. తులసమ్మను కేకేసి పిలిచాడు. సమాధానం రాలేదు, గూట్లో అగ్గిపెట్టెకోసం తడిమి, దీపం బుడ్డి వెలిగిస్తుంటే చేతులు వణకసాగాయి. దీపం వెలుగులో మంచంలో పడున్న తులసమ్మ ముఖంలోకి చూస్తూండిపోయాడు.

"తులసమ్మా! తులసమ్మా!" అంటూ పిలుస్తూ భార్యను తడితే కట్టెలా బిగుసుకు పోయిన శరీరం చేతికి తగిలింది. కుప్పేయించామన్న ఆనందాన్ని తనతో కలసి పంచుకోవాల్సిన తులసమ్మ, చివరకు కాంతయ్యకు దుఃఖాన్ని పంచి వెళ్లిపోయింది. "ఏవే తులసమ్మా! కుప్పేయించడం అయింది. మన పంట ఏటిపాలు గాకుండా దక్కిందే" అంటూ గొల్లున ఏడుస్తూ కాంతయ్య పెడుతున్న కేకలు ఉరుముల శబ్దంలో ఎవరికీ వినిపించడంలేదు.

(స్వాతి మాసపత్రిక, డిసెంబర్ 2010)